# గెస్ట్

'మధుర'



"లలితా!..."

"అబ్బా! ఏమిటండీ ఆ అరుపులు... ఎదురింటి వాళ్ళు, పొరుగింటి వాళ్ళు పరుగెత్తుకొస్తారు."

"వస్తే నాకేమన్నా భయమా! నా భార్యపేరు. నా ఇష్టం. లక్షసార్లు అరచి."

"చాల్లెండి... ఆనక పోష వచ్చిపడి పోతే నేనే బాధపడాలి. ఇంకలే తమరి అరుపులకు కారణం?"

"ఆ... బాగా గుర్తు చేసావు. ఈ రోజు నా సెక్రెటరీ పోస్టు కోసం ఇంటర్వ్యూకి వచ్చిన వాళ్ళలో నా బెస్ట్ ఫ్రెండ్ ఉన్నాడు. వాడికే ఉద్యోగం ఇచ్చేసాను. మేమిద్దరం కాలేజి డేస్‌లో ఎంత క్లోజ్‌గా ఉండేవాళ్ళమని... ఎక్కడ చూసినా మేమిద్దరం అతుక్కుపోయి ఉండే వాళ్ళం. అందరూ మమ్మల్ని 'అతుకుల బొంత' అనేవాళ్ళు. అహ్హహ్హ."

"తర్వాత..."

"తర్వాత... నేను బిజినెస్‌లో చేరితే వాడు పెద్ద జాబ్ చెయ్యాలని చదువు తోనే ఆగిపోయాడు... అలా విడిపోయాం."

"బ్రతికించాడు..."

"ఎందుకోయ్!?"

"లేకుంటే అతుక్కున్న మిమ్మల్నిద్దర్నీ భరించటం నా వల్లకాని పని కథా!"

"యూసిల్లీ.."

"ఇంతకీ అసలు విషయం..."

"అదేనోయ్! సాయంత్రం వాడిని మనింటికి డిన్నర్‌కి పిలిచాను. వాడికి మైసూర్ పాక్ చాలా ఇష్టం... నువ్వు చేసిన మైసూర్ పాక్ తింటే వాడు జన్మలో మర్చిపోడు..."

"అంటే నేనంత ఘోరంగా చేస్తానా!"

"అంతలోనే అలుకా! అద్భుతం కదా డియర్.. ఓ.కే. అను."

"అలాగే...." అతడి బుగ్గన ముద్దుపెట్టి లోనికెళ్ళింది లలిత.

కాలింగ్ బెల్ మ్రోగగానే తలుపు తీసింది లలిత.

"నువ్వా!..."పామును చూసినంత భయంతో అడిగింది లలిత.

"నువ్వు... మా మధు..." చేష్టలు దక్కి నిల్చుండి పోయాడతడు.

గిరుక్కున వెనక్కి తిరిగిందామె. అతడు గేటు దాటినట్లు గేటు చప్పుడు.

అతడే భర్త ఆహ్వానించిన గెస్టు అని తెలుసు లలితకు.

"ఎవరు లలితా...!" మధు అడిగాడు.

"రాంగ్ నెంబర్...." అని లోనికెళుతూ లలిత.

రాత్రి పది గంటలయినా రాని తన గెస్ట్ కోసం ఎదురు చూస్తూనే ఉన్నాడు మధు.

గెస్ట్ 'వచ్చాడని, వెళ్లాడని' చెప్పలేదు లలిత. ఎందుకు వెళ్లిపోయాడని భర్త నిలదీస్తే డొంకంతా కదులు తుంది. డొంక కదిలిస్తే తన కాపురం.

'పిచ్చి పిచ్చి పుస్తకాలు చదివి ఉద్రేకం ఆపుకోలేక తన ఇంట్లో అద్దెకుంటున్న వాడిని ఎన్నోసార్లు శృంగార సామ్రాజ్యంలోకి 'గెస్ట్'గా ఆహ్వానించానని ఎలా చెబుతుంది.

అందుకే... తేలు కుట్టిన దొంగలా నిద్ర నటిస్తోంది లలిత.

●